క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకులకు జిల్లాస్థాయి పదవులు


మెట్లపల్లి రాంబాబు


గుడిపూడి రఘు

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ నేతలకు జిల్లా పదవులు లభించాయి. వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మేరకు నియామకానికి సంబంధించి ఆదేశాలను జారీ చేశారు. దీనిపై ఆదివారం మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఓ ప్రకటన విడుదల చేశారు. స్వచ్ఛ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ మెట్లపల్లి రాంబాబును జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు.చాటపర్రు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గుడిపూడి రఘును పార్టీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శిగా నియమించారు. వారిని పలువురు నాయకులు అభినందించారు.

పెసర పంటపై తెగుళ్ల దాడి


పంటపై పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

దెందులూరు: మండలంలో పెసర పంటపై తేనె బంక, పచ్చ దోమ, తామర పురుగు ఆశించాయి. ఈ రసం పీల్చు పురుగుల వల్ల మొక్క నుంచి మొక్కకు తెగుళ్ల వ్యాప్తి చెందడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెందులూరు మండలం వ్యవసాయ శాఖ అధికారి దాము వెంకటేశ్వర్లు ఆదివారం తెగుళ్ల ఆశించిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైరస్ వ్యాప్తి చెందకుండా కొరాజన్ 80 మిల్లీమీటర్లు ఒక ఎకరానికి స్ప్రే చేస్తే వైరస్ వ్యాప్తి నివారణ చేయవచ్చని వెంకటేశ్వర్లు అన్నారు. వ్యాధులు ఆశించిన పంటల రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. ఈ మేరకు రైతులు కోరజాన్ స్ప్రేను తెగుళ్ల ఆశించిన పొలాలకు స్ప్రే చేస్తున్నారు.

పాత్తూరి శ్రీనివాసరాజుకు అభినందనలు

ఉంగుటూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్ష పదవి చేపట్టిన పాత్తూరి శ్రీనివాసరాజును ఉంగుటూరు మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణపురం మాజీ ఉపసర్పంచి అడపా శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఛాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు, ఉంగుటూరు ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ, కాగుపాడు వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతల కిషోర్, తాడిగడప వెంకటేశ్వరరావు, పెనుమాక విజయబాబు తదితరులు పొత్తూ రి శ్రీనివాసరాజును కలిసి అభినందనలు తెలిపారు.

సీనియర్ న్యాయవాది గొటికల ప్రసాదబాబు మృతి

భీమడోలు: భీమడోలు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది, అర్జావారిగూడెంకు చెందిన గొటికల వర ప్రసాదబాబు(54) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఆదివారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదా వెంకటరత్నం, న్యాయవాదులు కాలి నాగేశ్వరరావు, కాలి గంగరాజు, పి.రాజారామ్, ఉపాధ్యాయులు, పాస్టర్లు, బంధువులు మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రసాదబాబుకు భార్య, ముగ్గురు కుమారులున్నారు.

ఏలూరులో ముగిసిన చెస్ ఫెస్టివల్


పోటీల్లో విజయం సాధించిన చిన్నారులు

ఏలూరు రూరల్: ఏలూరు శాంతినగర్‌లో ఆదివారం అండర్–15 చెస్ ఫెస్టివల్ నిర్వహించామని అబ్రహం గ్యారీకాస్పారోవ్ చెస్ అకాడమీ డైరెక్టర్ జి యోహనాన్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పిపాల్ వుడ్ గ్లోబుల్ స్కూల్ ఆవరణలో ఆర్బిటర్లు జి స్వరూప్‌రాణి, పి యదిద్యా పరివేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో జి అభిషేక్ అబ్రహామ్ ప్రథమస్థానం, జి అనురూప్ మోషే రెండోస్థానం, పి హర్షవర్ధన్ మూడోస్థానంలో నిలిచారని వెల్లడించారు. వి.కార్తికేయ, పి.ఉదయ్‌కుమార్ సైతం నాలుగు, ఐదో స్థానం సాధించారని వివరించారు. వీరితో పాటు పి సాత్విక, కె మమిత్‌కుమార్, టి నేవనీత్, బి జస్వంత్, ఎస్‌కే పర్వాన్, బి ధరణి, ఎం అశ్విన్, ఎం బెన్ని, మోక్షిత్, ఆదర్స్ ప్రతిభ చాటారని పేర్కొన్నారు. విజేతలకు స్కూల్ ప్రతినిధులు ఎస్ బలరామ్, ఏఎస్ఎస్ మాధవ్, యలమంచిలి నాగేంద్ర శ్రీనివాస్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారని తెలిపారు.

పంట కాలువలు.. కాలుష్య కాసారాలు

- ఆక్వా సాగుతో అంతా కాలుష్యమయం
- ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు కరువు


కొత్తపల్లి కాలువలో కలుషిత నీటిలోనే పశువులు కడుగుతున్న రైతు


చినకాపవరం పంట కాలువలో ఆక్వా చెరువుల్లోని కలుషిత నీరు


పూడుకుపోయిన వెంకయ్య కాలువ


ఎ.గోపవరం పంట కాలువలో ఆక్వా చెరువుల నీరు

గణపవరం: ఆక్వా సాగువల్ల రైతులకు లాభాలు, ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా ప్రజలకు మాత్రం రోగాలను వ్యాపింపజేసే కాలుష్యాన్ని పెంపొందిస్తోంది. ఆక్వా చెరువుల్లోని కలుషిత నీటిని పంట, మురుగు కాలువలోకి అక్రమంగా వదిలివేయడంతో డెల్టాలో దాదాపు నీటి వనరులు కాలుష్యమయమయ్యాయి. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు దొరికే పరిస్థితి డెల్టా ప్రాంతంలోని ఏ గ్రామంలోనూ మచ్చుకు కూడా కనిపించని పరిస్థితి ఉంది. దీనితో ఏ గ్రామంలో చూసినా ప్రజలు వాటర్ ప్లాంట్ల నుంచి మంచినీరు కొనుక్కుని తాగుతున్నారు. ఆ స్తోమత, అవకాశం లేనివారు పంచాయతీ వారు సరఫరా చేసే కలుషిత నీటినే కాచి లేదా ఫిల్టర్ చేసుకుని తాగుతున్నారు. మూగ జీవాలు మాత్రం చెరువులు, కాలువల్లోని కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నాయి. చేపలు, రొయ్యల చెరువుల పుణ్యమా అని డెల్టాలోని మొత్తం పంట, మురుగు కాలువలన్నీ కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయి. అటు ఏలూరు నుంచి ఇటు నరసాపురం వరకూ డెల్టాలో ఆక్వా సాగు లేని గ్రామం లేదనే చెప్పవచ్చు. ఆక్వా చెరువుల్లో చేపలు, రొయ్యలకు వేసే మేతలు, మందులు, ఇతర రసాయనాలతో పాటు కోళ్ల, పశువుల వ్యర్థాలు అన్నీ కాలుష్య కారకాలే. ఆక్వా చెరువుల్లోని నీరు ఆకుపచ్చని రంగులో చిక్కబడి, దుర్వాసన వస్తోంది. చేపలు, రొయ్యలు పట్టుబడి సమయంలో ఆ నీటిని పంట, మురుగు కాలువల్లోకి అక్రమంగా వదిలేయడంతో నీటి వనరులు కాలుష్యం బారిన పడుతున్నాయి. ఈ పంట కాలువల్లోని కలుషిత నీరు గ్రామాల్లో మంచినీటి చెరువులకు చేరి, చెరువులు కాలుష్యమయంగా మారిపోతున్నాయి. పంచాయతీలు ఈ నీటినే కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చెరువుల్లోని నీరు ఫిల్టర్ చేసి సరఫరా చేస్తుండగా, మరి కొన్ని గ్రామాలు సరాసరి చెరువుల్లోని నీటినే పైపుల ద్వారా అందిస్తున్నారు. ఈ నీటిని తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రజలతోపాటు పశువులకు కూడా ఈ కలుషిత నీటి బెడద తప్పడంలేదు.

రోగాల బారిన పశువులు

జిల్లా పరిధిలోని పంట, మురుగు కాలువలు చేపలు, రొయ్యల చెరువుల నుంచి వచ్చిచేరిన కలుషిత నీటితో నిండి ఉంటున్నాయి. ఆనీరు తాగడానికి ఏమాత్రం పనికిరాదు. గత్యంతరం లేనిస్థితిలో పశువులు ఆనీటినే తాగి రోగాల బారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గణపవరం నిడమర్రు మండలాల్లోని గ్రామాలు మొత్తం ఆక్వా సాగువిస్తరించడంతో ఈ కాలుష్యం బెడద మరీ ఎక్కువగా ఉంది. గణపవరం మండలంలోని ఏగోపవరం పంటకాలువ ద్వారా గోపవరం, వరదరాజపురం, కొత్తపల్లి, సరిపల్లె, కొమ్మర ఛానల్ పంట కాలువ ద్వారా ఎస్.కొందేపాడుకి, కొమ్మర ఛానల్ పంటకాలువ ద్వారా వీరేశ్వరపురం, వాకపల్లి, కొమ్మరకు, చినకాపవరం కాలువ ద్వారా మండలపర్రు, బువ్వనపల్లి, ఎనికేపల్లి, సిద్ధాపురం, బావాయిపాలెం, క్రొవ్విడి, పెదకాపవరం, చినకాపవరానికి, వెంకయ్య కాలువ ద్వారా కొమ్మర, గణపవరం, సరిపల్లె, క్రొవ్విడి, బావాయిపాలెంకు, మొయ్యేరు ఛానల్ పంట కాలువ ద్వారా కోమర్రు, డి.కుముదవల్లి, మొయ్యే రు, ముప్పర్తిపాడు, కేశవరానికి తాగునీరు అందుతుంది. ఈ కాలువల్లోకి తరచూ అక్రమంగా ఆక్వా చెరువుల్లోని కలుషిత నీటిని, వరి పొలాల్లోని నీటిని వదిలివేయడం వల్ల గ్రామాలకు నిత్యం కలుషితనీరు ప్రవహిస్తోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు స్వచ్ఛమైన తాగునీటికోసం అల్లాడుతున్నాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక


భీమడోలులో ఆటో యూనియన్ నూతన కమిటీని అభినందిస్తున్న బాదర్వాడ కృష్ణమోహనరాజు

భీమడోలు: భీమడోలులోని శ్రీవేంకటేశ్వర ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవమైంది. భీమడోలులోని సంక్షేమ సంఘం కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా సీరా సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా ముప్పిడి సతీష్, కార్యదర్శిగా రాచేటి యోహాన్, సంయుక్త కార్యదర్శిగా కూరపాటి సర్వేశ్వరరావు, కోశాధికారిగా దొగ్గా అశోక్‌కుమార్, సభ్యులుగా పులి సుబ్రహ్మణ్యం, చిలకా ఇశ్రాయేలు, జి.దిలీప్‌కుమార్, చిన్నం సుబ్బారావు, దొడ్డిగర్ల సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు బాదర్వాడ కృష్ణమోహన్‌రాజు అభినందించారు.

సూపర్ సిక్స్ పథకాల అమలులో తాత్సారం

భీమడోలు: కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా నేటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చలేదని, దీనితో ప్రజలకు అల్లాడిపోతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో ఓ పత్రికా ప్రకటనను ఆయన విడుదల చేసారు. మ్యానిఫెస్టోలోని తల్లికి వందనం, రైతు భరోసా వంటి పథకాలను ఏడు నెలలు గడిచినప్పటికీ అమలు చేయకుండా తాత్సార్యం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పిల్లలు, తల్లులు, రైతులు, యువత, వలంటీర్లను మోసం చేసారన్నారు. ఎస్సీలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితం అని చెప్పి ఛార్జీలను వసూలు చేయడం దారుణమన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలపై మోయలేని భారాన్ని మోపుతున్నారన్నారు. ఫించన్లలో కోత వేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే పథకాలు అందించారని, నేడు ఆ పరిస్థితి లేదని ప్రజలంతా ఆందోళన చెందుతున్నారన్నారు.

ఆరోగ్యశ్రీ సేవల నిలుపుదల తగదు

దెందులూరు: ప్రైవేటు నెట్‌వర్క్స్ వైద్యశాలల్లో అందించే ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్యశ్రీతో పాటు ఈ హెచ్ఎస్ సేవలను నిలిపివేస్తామని ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల సమాఖ్య ప్రకటించినప్పటికీ కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పార్టీ సీనియర్ నేత ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో రూ.3 వేల కోట్ల బకాయిలు ఏపీ స్పెషాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఎన్ని విజ్ఞప్తులు చేసినా కూటమి ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఈ నెల 6 నుంచి ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ సేవలను నిలిపివేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల సమాఖ్య ప్రకటించడం ఆందోళన రేకెత్తించే తీవ్రమైన అంశమని అన్నారు. బకాయిలు చెల్లించకుండా వైద్యశాలలు ఎలా వైద్య పరీక్షలు, సేవలు అందిస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల ఆరోగ్యం కూటమి ప్రభుత్వానికి పట్టదా అని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని రాష్ట్రంలో ఉన్న పేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరి ఆరోగ్యం భద్రత భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ప్రైవేట్ నెట్వర్క్ వైద్యశాలల యూనియన్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసి పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని వైద్య సేవలకు పరీక్షలకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని పల్లెం ప్రసాద్ డిమాండ్ చేశారు.

తాతా సత్యనారాయణ సేవలు ఆదర్శనీయం

దెందులూరు: డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్, సర్పంచిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తాతా సత్యనారాయణ పార్టీకి అందించిన సేవలు మరువలేనివని, ఆయన క్రమశిక్షణ, పార్టీ పట్ల అంకితభావం నాయకులు, కార్యకర్తలకు ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం తాత సత్యనారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. పార్టీ ఏలూరు జిల్లా ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు గూడపాటి పవన్‌కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కాటి సుధాకర్, పార్టీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి, తొత్తడి వేదకుమారి, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, జిల్లా కార్యదర్శులు కట్ట ఏసుబాబు, గొల్ల కిరణ్, పులవర్తి సంతోష్, మండల యువజన విభాగం అధ్యక్షుడు గొరిపర్తి శ్రీనివాస్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ, దెందులూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు గొలుసు గణపతిరావు తదితరులు నివాళులర్పించారు.

హైందవ శంఖారావానికి ఉత్సాహంగా పయనం


ఉంగుటూరు నుంచి వెళుతున్న హిందువులు

ఉంగుటూరు: విజయవాడ కేసరపల్లి వద్ద ఆదివారం నిర్వహించిన హైందవ శంకారావ సభకు ఉంగుటూరు మండలం నుంచి పెద్ద సంఖ్యలో హిందువులు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. ఉంగుటూరు, చేబ్రోలు, నారాయణపురం, కైకరం, గోపినాథపట్నం, నాచుగుంట నుంచి పలువురు ఉత్సాహంగా విజయవాడ వెళ్లారు. బాదంపూడి వైజంక్షన్ వద్ద హైందవ శంఖారావానికి వెళ్లే వాహనాలకు ఎటువంటి ఆటంకం లేకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విజయవాడకు పయనం

భీమడోలు: విజయవాడ హైందవ శంఖారావం మహాసభకు భీమడోలు మండలం నుంచి హిందువులు తరలివెళ్లారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పాతూరు, సూరప్పగూడెం తదితర గ్రామాల నుంచి హిందువులంతా బస్సుల్లో వేలాదిగా బయలుదేరి వెళ్లారు. మండల బీజేపీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పటేల్, జిల్లా దళితమోర్చా అధ్యక్షుడు మత్తి శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన భక్తులు

దెందులూరు : గన్నవరంలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావానికి గాలాయగూడెంతో పాటు దెందులూరు మండలంలో భక్తులు తరలివెళ్లారు. గారపాటి చౌదరి ఆధ్వర్యంలో 600 మంది పైగా భక్తులు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సుల్లో తరలి వెళ్లారు. గాలాయగుడెం, సోమవరప్పాడు బైపాస్ వద్ద జెండాలు ఊపి దెందులూరు మండలం బీజేపీ అధ్యక్షుడు బుజ్జి గోపాల్ భక్తులను హైందవ శంఖారావానికి తరలించారు.

పాఠశాలలో మురుగు సమస్యకు మోక్షం


భీమడోలు ఉన్నత పాఠశాలలో పల్లపు ప్రాంతాన్ని పూడ్చి వేస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్డి ఉన్న ప్రాంతంలో మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీనితో పాఠశాలలోని విద్యార్థులు ముక్కులు మూసుకుని మరుగుదొడ్డిని వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పల్లపు ప్రాంతంలో మరుగుదొడ్డి నిర్మించి ట్యాంకు నుంచి వచ్చే మురుగునీరు బయటకు పోయేందుకు తూరలు ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల వర్షాలు కురవడంతో లోతట్టులోకి నీరు చేరి దుర్వాసన వ్యాపిస్తోంది. ఈ సమస్యలను జనవాణి దృష్టికి స్థానికులు తీసుకునివెళ్లారు. దీనిపై స్పందించిన భీమడోలు పంచాయతీ అధికారులు ఆ లోతట్టు ప్రాంతాన్ని పూడ్చి అక్కడ మెరక చేసారు. మురుగునీరు బయటకు పోయేలా తూరను ఏర్పాటు చేసినట్టు హెచ్ఎం బి.శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు తడికలపూడి విద్యార్థుల ప్రాజెక్టు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 2024 –25లో తడికలపూడి విద్యార్థులు రూపొందించిన స్టూడెంట్ అటెండెన్స్ యాప్ అనే వ్యక్తిగత ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైందని ఆ పాఠశాల ప్రతినిధులు ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం పొందిన సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచర్లుగా వ్యవహరించిన పావని, అన్నపూర్ణను ఆమె అభినందించి ఈ ప్రదర్శన జాతీయ స్థాయికి కూడా ఎంపిక కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

వైభవంగా సుదర్శన హోమం


సుదర్శన హోమం ముగింపు సందర్భంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తిరిగి సాయంకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శారద భాగవతారిణి ధ్రువ చరిత్రపై హరికథా కాలక్షేపం, వెంకటరాయ నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి నీలి శర్వాణి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

మాజీ సర్పంచ్ మృతి

పెదపాడు: సకల కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ లంక రంగారావు(93) ఆదివారం వృద్ధాప్యంతో మృతి చెందారు. ఎస్ కొత్తపల్లి గ్రామ పంచాయతీ ఏర్పడిన అనంతరం ఆయన హయాంలో గ్రామానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసారు. పాఠశాల నిర్మాణం, రహదారులు అభివృద్ధికి పాడుపడ్డారు. 1960 నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలంగా పనిచేసారు. 30 ఏళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధి కృషి చేసారు. పలు ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వికృతంగా... వీధి కుక్కలు

- నిడమర్రులో వైరస్ బారిన శునకాలు
- చర్మవ్యాధులతో వీధుల్లో సంచారం
- పెంపుడు కుక్కలకు సోకడంతో యజమానుల ఆందోళన


నిడమర్రు ఇందిరమ్మ కాలనీలో సంచరిస్తున్న చర్మవ్యాధి సోకిన కుక్క


చర్మ వ్యాధి సోకిన పెంపుడు కుక్క

నిడమర్రు: పశువులకు లంపీ స్కిన్ వైరస్ సోకినట్టే.. నిడమర్రు మండలంలోని వీధి కుక్కలు కొత్త రోగంతో బక్కచిక్కిపోతున్నాయి. వాటి శరీరంపై ఉన్న జుట్టురాలి, ఒంటి నిండా పుండ్లు, వాటి నుంచి రక్తం కారుతూ ఆ కుక్కల ఆకారం వికృతంగా మారుతోంది. ఈ వ్యాధి ఒకదాని నుంచి మరొక దానికి వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో వీధుల్లో శునకాలు కనబడితే స్థానికులు భయాందోళనలతో పరుగులు తీస్తున్నారు. మండల కేంద్రం నిడమర్రులో అధిక శాతం వీధి కుక్కలు వ్యాధి బారిన పడ్డాయి. ఇప్పటికే వీధి కుక్కల ద్వారా చర్మవ్యాధులు కొన్ని పెంపుడు కుక్కలకు కూడా సోకినట్లు పెంపుడు కుక్కల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాటికి చికిత్స చేయించి యజమానులు దూర ప్రాంతాల్లో వదిలేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

శునకాల వ్యాధి తీవ్రత గుర్తించాలి

నిడమర్రు పంచాయతీ పరిధిలో అధిక శాతం వీధి కుక్కలకు చర్మవ్యాధి సోకింది. పలు ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. వ్యాధి బారిన శునకం తిన్న ఆహారం, తాగిన ద్రవ పదార్థాలను మరో శునకం తీసుకుంటే వాటికి కూడా ఈ వ్యాధి సోకుతున్నట్లు స్థానికులు చెపుతున్నారు. అవి సంచరించే ప్రాంతాల్లో దుమ్ము, ధూళిని తొక్కిన జనాలకూ ఈ వ్యాధి వ్యాపిస్తుందని కొందరు భయపడుతున్నారు. పరిస్థితి విషమించినా పశువైద్యాధికారులు, పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవని నిడమర్రు గ్రామ ప్రజలు తప్పు పడుతున్నారు.

మండలంలో 550 వరకూ వీధి కుక్కలు

నిడమర్రు మండలంలో పశు గణాంకాల ప్రకారం 550 వరకూ వీధి కుక్కలు, 150 వరకూ పెంపుడు కుక్కలు ఉన్నట్లు అంచనా. శునకాలకు వచ్చిన చర్యవ్యాధిని తీవ్ర అలర్జీ లేదా డెర్మటైటిస్ అంటారని ప్రైవేటు పశు వైద్యాధికారులంటున్నారు. శుభ్రత లేని కారణంగా మరింతగా వ్యాధి ముదిరి చివరకు మృత్యువాత పడుతాయని వారంటున్నారు. వీటిలో చాలా కుక్కలు ప్యారాసైట్ ఇన్ఫెస్టేషన్ రోగం బారిన పడినట్లు తెలుస్తోంది. కుక్కలపై ఈ వ్యాధి ప్రభావంతో వాటి శరీరంపై బొచ్చు ఊడిపోయి గజ్జి మాదిరిగా తయారై పుండు పడుతుందని చెపుతున్నారు.

ఆ కుక్కలతో భయంగా ఉంది



మా ఊళ్లో చాలా రోజులుగా కుక్కల శరీరంపై ఉన్న బొచ్చు రాలిపోతోంది. రాలిపోయిన చోట పురుగులు ఉంటున్నాయి. ఈ కక్కలను చూస్తేనే భయంగా ఉంది. అవి వస్తున్నాయంటేనే దూరంగా వెళ్లపోతున్నాం. ఈ కుక్కలకు ఇప్పటి వరకూ ఎవ్వరూ ఏ విధమైన వైద్యం చేసిన దాఖలాల్లేవు.
– సిరాపు శివాలు, నిడమర్రు

పెంపుడు కుక్కలకు సోకింది



వీధి కుక్కల నుంచి పెంపండు కుక్కలకు ఈ చర్య వ్యాధి సోకుతుంది. జుట్టు ఊడిపోయిన కుక్కలను చూస్తేనే పరుగులు తీస్తున్నాం. పిల్లలు, వృద్ధులపై వ్యాధి బారిన పడిన కుక్కలు దాడి చేస్తే ఏమన్నా అవుతుందోమేనని ఆందోళనగా ఉంది. వ్యాధుల బారిన పడిన ఈ కుక్కలను గ్రామాలకు దూరంగా తరలించాలి.
– దామా విజయ, నిడమర్రు

అధికారులు చర్యలు తీసుకోవాలి

కుక్కలకు చర్మ వ్యాధి విషయం ఉన్నత అధికారుల దృష్టిలో ఉంది. ఈ వ్యాధి సోకిన శునకాలు ఏ ప్రాంతంలో ఉన్నాయో సమగ్ర నివేదిక సోమవారం సమర్పించాలని ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం. గోమర్లు పెరిగితే కుక్కలకు ఈ రకం చర్మ వ్యాధులు సీజనల్‌గా వస్తుంటాయి.
– సీహెచ్ జేఎస్ సత్యనారాయణ, మండల పశు వైద్యాధికారి, నిడమర్రు

వాసు దేవాలయంలో విశేష అభిషేకాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పవిత్రమైన ధనుర్మాసం నెల పురస్కరించుకొని స్థానిక పవర్ పేటలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వాసుదేవ స్వామి దేవస్థానంలో ఆదివారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజల్లో ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కందుకూరి వేంకట విజయ్‌కుమార్ విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో యంత్రం నాలుగు గంటల నుంచి లక్ష తులసీదళార్చన, 6 గంటల నుంచి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.